క్లుప్తంగా

స్టూడెంట్ కిట్లు పంపిణీ



విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న దృశ్యం

సోంపేట: మండలంలోని బారువ మేజర్ పంచాయతీ బాలికోన్నత పాఠశాలలో స్టూడెంట్ కిట్లను వైస్ ఎంపీపీ గురాల శ్రీను విద్యార్థులకు సోమవారం పంపిణీ చేశారు. విద్యార్థి దశనుంచే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని పిల్లలకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆశ్రమ విద్యార్థులకు గొడుగులు వితరణ



ఆశ్రమ విద్యార్థులకు గొడుగులను అందజేస్తున్న ప్రియాన్స్ కుటుంబసభ్యులు

కంచిలి: మండపల్లి గ్రామంలోని వానప్రస్థాశ్రమం విద్యార్థులకు సోంపేట పట్టణానికి చెందిన రాజస్థాన్ స్వీట్స్ దుకాణదారుడు పురోహిత్ ప్రకాశ్, విమల దంపతులు 72 గొడుగులను వితరణ చేశారు. వీటిని ఆశ్రమం ప్రతినిధికి సోమవారం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు.

‘ఆత్మహత్యకు అనుమతివ్వండి’

కాశీబుగ్గ: భూసమస్యను పరిష్కరించాలని.. లేదంటే ఆత్మహత్య చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని పలాస మండలం కంట్రగడ గ్రామానికి చెందిన దళిత మహిళ చింతల సరస్వతి డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలియజేశారు. భూసేకరణ పేరిట పెత్తందారులు తన భూములను తీసుకోవడానికి చూస్తున్నారని ఆరోపించారు. భూసమస్యపై ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యేలకు లేఖ రాసినట్టు చెప్పారు. తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

సైన్స్ సామగ్రి మంజూరు చేయాలి



జీవశాస్త్ర పాఠ్య పుస్తకాలను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

కాశీబుగ్గ: జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో ఉన్న సైన్స్‌ల్యాబ్‌లకు సామగ్రిని మంజూరు చేయాలని జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం శ్రీకాకుళం శాఖ ప్రతినిధులు పిలుపునిచ్చారు. జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం ప్రాంతీయ సమావేశం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ చినబడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు పుట్టా ఉదయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలాస, వజ్రపుకొత్తూరు జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జీవశాస్త్ర ఉపాధ్యాయులుగా ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా కొత్త కార్యవర్గాన్ని ఎనుకున్నారు. జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం పలాస నాయకులుగా చింతాడ వెంకట నగేష్, ఎస్ఎస్ మంగరాజు, కాంతారావు, బి.దుర్యోధన, దాసరి శ్రీనివాసరావు, వజ్రపుకొత్తూరు నాయకులుగా టి.మోహన్, టొంక గంగాధర్, వెంకటరమణ నియమితులయ్యారు. ప్రతినిధులు మోహనరావు, వెంకటరావు, కాంతారావు, నగేష్ పాల్గొన్నారు.

మామిడిపల్లిలో విషజ్వరాలు!

కాశీబుగ్గ: బొడ్డపాడు పంచాయతీ మామిడిపల్లి గ్రామంలో విషజ్వరాలు ప్రబలాయి. పలువురు జ్వరాలతో మంచం పట్టారు. వంకల జశ్విక్, వంకల తులసమ్మ, అలేఖ్య, పుణ్యవతి, పార్థు తదితరులు జ్వరంతో బాధపడుతున్నారు. వీరిలో కొంతమంది పలాస, శ్రీకాకుళంలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వైద్యాధికారులు స్పందించి వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అవార్డులకు నాట్యకారులు ఎంపిక

ఇచ్ఛాపురం: స్థానిక స్వేచ్ఛానృత్య తరంగిణి కూచిపూడి, భరతనాట్యం, జానపద నాట్యశిక్షణాలయానికి చెందిన నాట్యకారులు యశ్విత, శరణ్య, సంజన, అనుశ్రీ, భూమిక, లావణ్యలు నాట్యమయూరి అవార్డులకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని అకాడమి అధ్యక్షుడు కె.గోవిందరావు సోమవారం తెలిపారు. ఈనెల 24వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్న ఆలిండియా లెవెల్ డాన్స్ 2024 ఉత్సవాల్లో అవార్డులను నృత్యమాల నాట్య కళా వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు ప్రదానం చేస్తారని చెప్పారు.

కవిటిలో పూడికతీత పనులు

కవిటి: కవిటిలో భారీగా కురిసిన వర్షంతో కాలువలు పూడికుపోయాయి. దీంతో పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి పూడికతీత పనులను సోమవారం చేపట్టారు. కొత్తచెరువుకు వరద నీరు వెళ్లే కాలువ మూసుకుపోవడంతో అడ్డంగా ఉన్న చెత్తను తొలగించారు. పనుల్ని స్థానిక ఈవోపీఆర్డీ శివాజీపాణిగ్రాహి, ఈవో జి.వీరభద్రస్వామి పర్యవేక్షించారు.

ప్రజల ఆశలను నెరవేర్చాలి

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రజలకు అనేక హామీలు ఇచ్చారు. వీటిని నమ్మిన జనం వారికి అధికారాన్ని కట్టబెట్టారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారం, పథకాల అమలు, నిధుల మంజూరుపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ జనానికి ఇచ్చిన హామీల అమలు కోసం శాసనసభలో ప్రస్తావించాలని డిమాండ్ చేస్తున్నారు.



గ్రోయిన్లు పూర్తిచేయాలి



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తిత్లీ తుఫాన్‌కు కొట్టుకుపోయిన 11 గ్రోయిన్లను పునరుద్ధించేందుకు స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ కృషి చేయాలి. దీనిపై అసెంబ్లీలో ప్రస్తావించాలి. ఇచ్ఛాపురం మండలం, మున్సిపాలిటీలో సుమారు ఆరువేల మంది రైతులు పండించే పంటకు ప్రాణాధారం ఈ గ్రోయిన్లే. గత రెండేళ్లుగా వర్షాలు పడకపోవడం, బాహుదానదిలో నీరు లేకపోవడంతో రైతులు పంటలు పండించలేక పోయారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే రైతుల పక్షాన ఆలోచించి గ్రోయిన్లు నిర్మాణానాకి నిధులు తీసుకురావాలి

– బోర పుష్ప, ఎంపీపీ, ఇచ్ఛాపురం మండలం

సాగునీటి వనరుల్ని అభివృద్ధి చేయాలి



సాగునీటి వనరుల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలి. గంగాసాగరం మినీ రిజర్వాయర్ నిర్మాణాన్ని పూర్తిచేయాలి. మిగతా గ్రామాల్లో ఉన్న సాగునీటి వనరుల్ని కూడా అభివృద్ధి పరచాలి. ఇక్కడ శాశ్వత సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో ఏటా పంటలకు గ్యారంటీ లేకుండా పోయింది. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా పారదర్శకమైన పరిపాలన అందించాలి. అర్హులైన పౌరులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలి. వీటి కోసం స్థానిక ఎమ్మెల్యే కృషి చేయాలి.

–యారడి ఆనందరావు, సర్పంచ్, గోకర్ణపురం పంచాయతీ, కంచిలి మండలం

రైతు పెట్టుబడి సాయంపై స్పందించాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తక్షణమే రైతుల పెట్టుబడి సాయంపై నిర్ణయం తీసుకోవాలి. టెక్కలిలో మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుపై మంత్రి అచ్చెన్నాయుడు ప్రస్తావించాలి. కౌలు రైతుల గుర్తింపు కార్డులు, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం, టెక్కలి చుట్టు పక్కల ప్రాంతాల రైతులకు పూర్తి స్థాయిలో సాగునీటిపై చర్చించాలి. ఉపాధి అవకాశాలు పెరిగే విధంగా గ్రానైట్ ఇతర అనుబంధ పరిశ్రమలు ఏర్పాటుపై చర్చించాలి.

–ఎస్.షణ్ముఖరావు, ప్రజా, కార్మిక సంఘాల నాయకుడు, టెక్కలి

గ్రామీణ రోడ్లపై దృష్టి సారించాలి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్ఛాపురం మండలంలో చాలా గ్రామాలకు పక్కా తారు రోడ్లు వేశారు. ఇంకా కొన్ని గ్రామాలకు సరైన రోడ్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే అశోక్ గ్రామీణ రోడ్ల నిర్మాణాలపై దృష్టి సారించి, నిధులు మంజూరు చేస్తే బాగుంటుంది. కేశుపురం, మండపల్లి, టి.బరంపురం రోడ్లకు నిధులు తీసుకురావాలి. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో టెండర్ ప్రక్రియ పూర్తయిన బూర్జపాడు–డొంకూరు మధ్యలోని రెండు వంతెనలను నిర్మించేందుకు కృషి చేయాలి.

– సల్ల దేవరాజు, సన్యాసిపుట్టుగ, ఇచ్ఛాపురం మండలం

ఆఫ్‌షోర్‌పై దృష్టి పెట్టాలి



రేగులపాడులో 50 శాతం పనులతో నిలిచిపోయిన మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులు పునఃప్రారంభించేలా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అసెంబ్లీలో మాట్లాడాలి. ఇది పూర్తయితే సుమారు 30 వేల ఎకరాలకు సాగునీరు, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి తాగునీరు అందుతోంది.

– కొర్రాయి బాలకృష్ణ యాదవ్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు

జీడికి మద్దతు ధర ప్రకటించాలి



ఉద్దాన ప్రాంతంలో పండుతున్న జీడిపిక్కలకు మద్దతు ధర దక్కేలా స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష కృషి చేయాలి. ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించాలి. 80 కిలోల జీడి పిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర కల్పించడంతో పాటు ప్రభుత్వమే జీడి గింజలను కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలి.అభివృద్ధి చెందుతున్న పలాసకు జీడి బోర్డు, కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.

–తెప్పల అజయ్‌కుమార్, ఏపీ జీడి రైతు సంఘం, జిల్లా కన్వీనర్

మున్సిపాలిటీ సమస్యలపై దృష్టిపెట్టాలి



ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో నెలకున్న సమస్యలను ఎమ్మెల్యే అశోక్ పరిష్కరించాలి. దీని కోసం ప్రత్యేక నిధులు తీసుకొచ్చేలా శాసనసభలో ప్రస్తావించాలి. పలు వార్డుల్లో నెలకున్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. అలాగే ఈ ప్రాంతంలో విద్యార్థులకు సాంకేతిక, వృత్తి విద్యను అందించేందుకు అవసరమైన కళాశాలను ఏర్పాటు చేయాలి.

–డాక్టర్ నిత్యానంద పట్నాయక్, డిగ్రీకళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



తాతయ్యకు సాయాన్ని అందజేస్తున్న నాయకులు

కవిటి: శిలగాం గ్రామానికి చెందిన కాళ్ల తాతయ్య ప్రమాదంలో గాయపడ్డారు. ఈయన్ని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి తదితరులు సోమవారం పరామర్శించారు. తనవంతుగా ఐదు వేల రూపాయలను బాధితుడికి అందజేశారు. పరామర్శలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, మున్సిపల్ కౌన్సిలర్ బచ్చు జగన్‌రెడ్డి ఉన్నారు.

ఇద్దరికి గాయాలు



క్షతగాత్రులను 108 వాహనంలో రిమ్స్‌కు తరలిస్తున్న దృశ్యం.

టెక్కలి రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన స్థానిక ఆదిఆంధ్ర వీధి సమీప జాతీయ రహదారిపై సోమవారం రాత్రి చోటు చేసుకుంది. నందిగాం మండలం దిమ్మిడిజోల గ్రామానికి చెందిన కొల్లి రూన్సీ, లంక చంద్రశేఖర్ ద్విచక్ర వాహనంపై టెక్కలి నుంచి నందిగాం వైపు వెళ్తుండగా.. ఆదిఆంధ్ర వీధి సమీపంలో రోడ్డును దాటుతున్న గేదెను ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరూ గాయపడ్డారు. వీరిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించగా.. వైద్యుడు ఎ.వినోద్ వైద్యపరీక్షలు నిర్వహించారు. మేరుగైన వైద్యం కోసం 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. టెక్కలి పోలీసులు కేసు నమోదు చేశారు.

రైతు భరోసా నిధులు విడుదలకు వినతి

ఇచ్ఛాపురం రూరల్: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతు భరోసా నిధులను తక్షణమే విడుదల చేయాలని ఎంపీపీ బోర పుష్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మండల వ్యవసాయాధికారి టి.భార్గవికి సోమవారం వినతిపత్రం అందజేశారు. మండలం, మున్సిపాలిటీ పరిధిలో సుమారు ఆరువేల మంది వరకు రైతులు ఉన్నారని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ వ్యవసాయ పనులకు ముందుగానే రైతు భరోసా నిధులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఇప్పటికే రైతులు అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేశారని, తక్షణమే రైతు భరోసా నిధులు విడుదల చేసి హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. వినత పత్రం అందించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, నాయకులు సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, కారంగి మోహనరావు, దక్కత నూకయ్యరెడ్డి, సల్ల దేవరాజు, సర్పంచ్‌లు కారంగి త్రినాథ్‌రెడ్డి, నీలాపు సారథిరెడ్డి, వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్‌రెడ్డి, ఆశి పురుషోత్తమరెడ్డి, ఇసురు తులసీరాం, ఆశి కృష్ణారెడ్డి, ఇసురు యాదవరెడ్డి, పటాన శ్రీనివాసరెడ్డి ఉన్నారు.



ఏవో భార్గవికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హిస్టరీ అధ్యాపకుని ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానం

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ బోధన కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై.. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 24వ తేదీన ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాల కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

‘పైడిగాం’ ఆధునికీకరణకు నిధులు మంజూరు చేయాలి

సోంపేట: మండలంలోని పైడిగాం ప్రాజెక్టు ఆధునీకరణకు రూ. 17 కోట్లు నిధులు వెంటనే ప్రభుత్వం మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి పైడిగాం ప్రాజెక్టును సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం పైడిగాం ప్రాజెక్టు ద్వారా ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందుతోందని.. దీన్ని ఆధునీకరణ చేస్తే మరో ఏడు వేల ఎకరాలకు సాగునీరు అందజేసే అవకాశం ఉందన్నారు. ఆధునికీకరణ పనులు చేపట్టక పోవడంతో ప్రాజెక్టు పరిధిలోని శివారు గ్రామాలైన పలాసపురం, లక్కవరం, బూరగాం, జింకిభద్ర, బెంకిలి గ్రామాలకు సకాలంలో నీరు అందడం లేదన్నారు. పరిశీలనలో సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు కె.మోహనరావు, జిల్లా కమిటీ సభ్యులు నాగమణి, మండల కన్వీనర్ సంగారు లక్ష్మీనారాయణ ఉన్నారు.



పైడిగాం ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

సత్యసాయి బోధనలతో ఆదర్శ జీవనం



సంగీత శిక్షకుడు జోగారావును సత్కరిస్తున్న దృశ్యం

కవిటి: సత్యసాయి బోధనలు ఆచరించడం ద్వారా మానవులు ఆదర్శ జీవన విధానాన్ని అలవర్చుకోవచ్చునని వక్తలు అన్నారు. గురుపౌర్ణమి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం రాజపురం సత్యసాయి మందిరంలో ముగ్గురు వివిధ రంగాల్లో సేవల్ని అందిస్తున్న గురువులను సత్యసాయి సంస్థల ఆధ్వర్యంలో సన్మానించారు. గొండ్యాలపుట్టుగకు చెందిన సంగీత శిక్షకుడు రెల్ల జోగారావు, బాలవికాస్ తరగతులు, భరత నాట్యంలో చిన్నారులకు శిక్షణ ఇస్తున్న భూలక్ష్మి, సంగీతం, వాస్తు విభాగాల్లో సేవలందిస్తున్న కృష్ణ రౌళోలకు సత్యసాయి భజనమండలి ఆధ్వర్యంలో దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికల్ని అందించారు.

నిలిచిపోయిన పూడికతీత పనులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పాతటెక్కలి వంశధార 60 ఆర్ కాలువలో పూడిక తీత పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కాలవలో దట్టంగా చీపురుగడ్డి, ముళ్ల పొదలు అల్లుకోవడంతో దిగువకు నీరు పారడం లేదని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాతటెక్కలి కాలనీ నుంచి ఎలిమెంటరీ పాఠశాల వెనక భాగం వరకు సుమారు అరకిలో మీటరు పనులు చేపట్ట లేదు. దీంతో పాత టెక్కలి, పొల్లాడ, కొమరల్తాడ, ఇతర ప్రాంతాలకు సాగు నీరు జోరుగా పారడం లేదు. వంశధార అధికారులు కాలువను పరిశీలించి ఇబ్బందుల ఉన్న చోట సమస్యను పరిష్కరించి పూడిక తీసి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.



పాతటెక్కలి వద్ద కాలువలో పేరుకుపోయిన ముళ్లపొదలు

విద్యార్థులను ప్రోత్సహించేలా శిక్షా సప్తాహ్

- టెక్కలి ఉప విద్యా శాఖాధికారి విలియమ్



కోటబొమ్మాళి: ప్రకాష్‌నగర్ కాలనీ పాఠశాలలో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంఈవోలు

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యతలను మరింత ప్రోత్సహించేలా శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉప విద్యా శాఖాధికారి విలియమ్ అన్నారు. స్థానిక ఆదిఆంధ్రావీధిలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు వారం రోజులు రోజుకో కార్యక్రమంతో విద్యార్థులను జాగృతం చేయడంతో పాటు తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో డి.తులసీరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు నందేశ్వరరావు, వార్డెన్ సునీత, వార్డు సభ్యులు తోట లోకేశ్వరరావు, స్థానిక ప్రతినిధులు ఎ.రాహుల్, పి.యర్రయ్య, టి.రాజశేఖర్, డి.సత్యం, డి.అప్పారావు పాల్గొన్నారు.

టీఎల్ఎంతో బోధన చేపట్టాలి

కంచిలి: టి.ఎల్.ఎం.ను ఉపయోగించి బోధన చేపట్టాలని, దీని వలన విద్యార్థులకు సులభంగా పాఠ్యాంశాలు అర్థమవుతాయని ఎంఈఓలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు అన్నారు. జాడుపూడి గ్రామంలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని సందర్శించి టీఎల్ఎం మేళాను పరిశీలించారు. చొట్రాయిపురం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం మడ్డు తిరుపతిరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. బూరగాం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సోమేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా హిందీ అక్షరాలను ఖాళీ బాటిల్ కప్పులపై రాశారు.

సృజనాత్మకశక్తిని పెంపొందించేందుకు..

ఇచ్ఛాపురం రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ‘శిక్షా సప్తాహ్’ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని కొళిగాం పాఠశాల హెచ్ఎం నరేంద్రనాథ్ పట్నాయక్ అన్నారు. రాష్ట్ర సమగ్రశిక్షా విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు ‘బోధన సామగ్రి ప్రదర్శన’ కార్యక్రమాన్ని చేపట్టారు. ఉపాధ్యాయులు పాపారావు, జ్యోతి, రేణుక, పద్మావతి, చంద్రవదన, వాణీ, దేవాకీ పాల్గొన్నారు.

కోటబొమ్మాళిలో..

కోటబొమ్మాళి మండలంలోని 94 ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం ప్రారంభమైంది. ఎంఈవోలు ఎస్.అప్పలరాజు, ఎల్.వి. ప్రతాప్ ఆధ్వర్యంలో ప్రకాష్‌నగర్‌కాలనీ బీసీ పాఠశాలలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. దంత యూపీ పాఠశాలలో హెచ్ఎం గొండు నారాయణరావు ఆధ్వర్యంలో వివిధ బోధన సామగ్రిని ప్రదర్శించారు.

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం జరిగింది. మొదటిరోజున ఎటువంటి ఖర్చులు లేకుండా టీఎల్ఎంలను తయారు చేసి విద్యార్థులకు వాటిగురించి ఉపాధ్యాయులు వివరించారు.

ఆకట్టుకున్న మట్టి ప్రదర్శనలు

కాశీబుగ్గ: మందస మండలం కేజీబీవీలో ఉత్సాహంగా కార్యక్రమం జరిగింది. మట్టి వస్తువులను తయారు చేసి విద్యార్థులు ప్రదర్శించారు. మందస ఎంఈవో లక్ష్మణరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వాసంతి, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, మీనా, ఉమా, లలితా, ఇంద్రవతి, పవన్, అశ్విని, లావణ్య, భవాని తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి: ఆశ్రమ పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అధికారులు



కంచిలి: జాడుపూడి ప్రాథమిక పాఠశాలలో టీఎల్ఎంను పరిశీలిస్తున్న ఎంఈవోలు శివరాంప్రసాద్, చిట్టిబాబు



ఇచ్ఛాపురం: విద్యార్థులు ప్రదర్శిస్తున్న టీఎల్ఎంలు



కోటబొమ్మాళి: దంత యూపీ పాఠశాలలో..



కంచిలి: బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాలల వస్తువులు ప్రదర్శన





కాశీబుగ్గ: మందస కేజీబీవీలో మట్టి వస్తువులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బాహుదాకు చేరిన వరద నీరు

ఇచ్ఛాపురం రూరల్: బాహుదానది రెండేళ్ల తరువాత వరద నీటితో కళకళలాడుతోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నదిలో నీరు చేరింది. దీంతో పొలాలకు సాగు నీరు పుష్కలంగా అందే అవకాశం ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఈదుపురం వంతెన వద్ద బాహుదానది పరవళ్లు

కొనసాగుతున్న వరద ఉద్ధృతి

కాశీబుగ్గ: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటపొలాలు చెరువలను తలపిస్తున్నాయి. ఒడిశా రాష్ట్రం మహేంద్రగిరి పర్వతాలపై భారీగా కురిసిన వానలతో వరదనీరు మండలంలోని నీటి వనరులను ముంచెత్తింది. వరహాలగెడ్డ పారుతుండడంతో కంబిరిగాం వంతెన వద్ద పరుపుపై వరదనీరు జోరుగా పారుతోంది. వరహాలగెడ్డ సాగరం, హరిసాగరం, జగన్నాథ సాగరం నిండుకుండను తలపిస్తున్నాయి.